

ఎంఆర్‌పికే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి- కడియం

ఎరువులు, పురుగుల మందులను ఎంఆర్‌పి రేట్లకే అమ్మాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫెర్టిలైజర్స్ యజమానులతో ఎఒ కె.ద్వారకాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడి మాధవరావు, ఎడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫెర్టిలైజర్స్ దుకాణాల వద్ద నిల్వల పట్టిక, వాటి ఎంఆర్‌పి ధరలు ప్రదర్శించాలన్నారు. రైతులకు అవసరానికి ఉపయోగపడే ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన పురుగుమందులు అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని, తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న వరద



జలదిగ్బంధంలో కిర్లంపూడి మండలంలో రాజుపాలెం గ్రామం

ఏలేరు రిజర్వాయర్ లోకి సామర్థ్యానికి మించి చేరుతున్న నీరు

పొలాలు, ఊళ్లను చుట్టుముడుతున్న వైనం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో 60 వేల ఎకరాల పంటలకు పుష్కలంగా సాగునీరు అందిస్తున్న ఏలేరు రిజర్వాయర్ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. అవే పంటలను ముంచెత్తింది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఉప్పొంగింది. సామర్థ్యానికి మించి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు రికార్డు స్థాయిలో వరద నీటిని కిందకు వదులుతున్నారు. 25 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు 10 మండలాల పరిధిలో 86 గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. ఇందులో సగం గ్రామాలను పూర్తిగా వరద నీరు చుట్టుముట్టింది. నదులలోలా నీరు పొలాల మీదుగా ప్రవహిస్తుంది. కిర్లంపూడి, సామర్లకోట, పెద్దాపురం మండలాలలోని కొన్ని గ్రామాలు, పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు తదితర మండలాల్లోని పలు ప్రాంతాలు వరద ప్రభావం ఉంది. కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలుచోట్ల కాలువలకు గండ్లు పడడంతో పంట పొలాలు నీట మునిగాయి. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో రెండు రోజులు క్రితం ఏలేరు ప్రధాన కాలువకు పడిన గండితో చుట్టుపక్కల నాలుగు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పిఠాపురం మండలం రాపర్తి వద్ద గొర్రికండి వాగుకు గండి పడింది. ఈ కారణంగా పిఠాపురం మండలంలో 7వేల ఎకరాలు, గొల్లప్రోలు మండలంలో 5వేల ఎకరాలు, యు.కొత్తపల్లి మండలంలో 250 ఎకరాలు వరి పంట ముంపునకు గురైంది.

పిఠాపురం- గొల్లప్రోలు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఈ రహదారిపై తాత్కాలికంగా రాకపోకలను నిలుపుదల చేశారు. పిఠాపురం - సామర్లకోట రోడ్డులోనూ రాకపోకలు నిలిపివేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శాశ్వత నివాసం కోసం పిఠాపురంలో కొనుగోలు చేసిన స్థలం సైతం ముంపునకు గురైంది. వరద నేపథ్యంలో కాకినాడ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలకు మంగళవారం మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు.

62 వేల ఎకరాల్లో పంటలకు నష్టం

కాకినాడ జిల్లాలోని 21 మండలాలపై వరద ప్రభావం పడింది. 62,505 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 257 గ్రామాల్లో 27,561 మంది రైతులు నష్టపోయారు. అత్యధికంగా కిర్లంపూడి మండలంలో 14,557 ఎకరాలు పూర్తిగా నీటమునిగాయి. పిఠాపురం మండలంలో 14 వేల ఎకరాలు, తొండంగి మండలంలో 7 వేల ఎకరాలు, గొల్లప్రోలు మండలంలో 5 వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయి.

ఏలేరుకు తగ్గుతున్న వరద

ఏలేశ్వరం : ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఏలేరు రిజర్వాయర్‌లోకి గరిష్టంగా సోమవారం సాయంత్రానికి 47 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. అయితే మంగళవారం సాయంత్రానికి 21 వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో కాలువల ద్వారా సముద్రానికి విడుదల చేసే నీటిని గంట గంటకు తగ్గిస్తూ మంగళవారం సాయంత్రానికి 2 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. బుధవారానికి నీటి విడుదల మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ సామర్థ్యం 86.56, మీటర్లు కాగా 85.56 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. ఎర్రవరంలో నీట మునిగిన పొలాలను వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్ పరిశీలించారు.నీరు తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా వేస్తామన్నారు. ఏలేరు రిజర్వాయర్‌ను ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అధికారులతో కలిసి సందర్శించారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆమె వెంట ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, వైస్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, కౌన్సిలర్లు, అధికారులు ఉన్నారు.

జలదిగ్బంధంలో పలు గ్రామాలు

పిఠాపురం : ఏలేరు వరదతో నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాపర్తి గ్రామానికి వెళ్లే మార్గంలోని గొర్రెకండి కాలువకు గండిపడడంతో చుట్టుపక్కల పంట పొలాలు ముంపు భారిన పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో నివాసాలను వరద నీరు ముంచెత్తింది. రాపర్తి, ధర్మవరం, పి.తిమ్మాపురం, వెల్లార్ గ్రామాలకు వెళ్లే రహదారులు నీటితో మునిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 216 జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో ఒక పక్క మార్గాన్ని అధికారులు మూసివేశారు. టోల్ గేట్ వద్ద గల గొర్రికండి కాలవ నీటి ఉధృతి పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గొల్లప్రోలు మండలం పరిసరాల ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్, ఆర్‌డిఒ ఇ.కిశోర్ గండ్లను రైతులతో కలసి పరిశీలించారు. పిఠాపురం మండలంలో 2800 హెక్టార్లు, గొల్లప్రోలు మండలంలో 1800 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 100 హెక్టార్లలో మొత్తం 4760 హెక్టార్లలో వరిపంట ముంపునకు గురయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ సూరంపేట, ఇందిరానగర్, వైఎస్‌ఆర్ కాలనీల్లో మాజీ ఎంపీ వంగా గీత పర్యటించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలు ముంపు గ్రామాలను మాజీ ఎంఎల్‌ఎ వర్మ పరిశీలించారు.

నిలిచిపోయిన రాకపోకలు

సామర్లకోట : ఏలేరు జలాశయం నుంచి వస్తున్న వరద పిఠాపురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపైకి రావడంతో సామర్లకోట-పిఠాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సామర్లకోట బ్రౌన్ పేట జంక్షన్ నుంచి పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. టిడ్ కో గృహ సముదాయాల చుట్టూ భారీగా వరద నీరు చేరుకుంది. దీంతో కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. క్రైస్తవుల శ్మశానం ముంపునకు గురైంది. దీంతో గత రెండు రోజులుగా మరణించిన వారి అంత్య క్రియలు జరిపించుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీలో బుడగల పాప, సరిపల్లి అప్పారావుల ఇళ్లు నేలమట్టమయ్యాయి. టిడ్‌కో నిర్వాసితులకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి నిత్యావసర సరుకులు అందజేశారు. ఏలేరు వరద బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకుంటామని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామితో కలిసి పర్యటించారు. కాండ్రకోట వద్ద కొట్టుకుపోయిన వంతెన స్థానంలో తాత్కాలిక బ్రిడ్జిని రూ.50 లక్షలతో నిర్మించేందుకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

కండివాగులో పడి మహిళ మృతి

కోటనందూరు : పాత కొట్టం గ్రామ సమీపంలో ఉన్న కండి వాగులో ప్రమాదవశాత్తు మహిళ కాలు జారి పడిపోవడంతో మృతి చెందిందని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కొత్త కొట్టం గ్రామానికి చెందిన కోరుమిల్లి తలుపులమ్మ(60) మంగళవారం కండి వాగులో బట్టలు ఉతకడానికి దిగింది. ఈ క్రమంలో ఆమె ప్రమాదవశాత్తు వాగులో పడిపోవడంతో వాగులో కొట్టుకుపోయి మృతి చెందింది. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



సామర్లకోట-పిఠాపురం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద



పెద్దాపురంలో సహాయక చర్యల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది



పిఠాపురంలో ముంపు నుంచి బాధితుడిని మోసుకొస్తున్న స్థానికులు



ఏలేశ్వరంలో నీట మునిగిన పంటలు

గోదావరి ఉగ్రరూపం

లంక ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎగువన కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. 24 గంటల్లోనే భద్రాచలం వద్ద 24 అడుగుల మేర వరద ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం రాత్రికి 49.80 అడుగులకు నీటి మట్టం చేరింది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బుధవారం తెల్లవారు జామున మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి ప్రవాహం చేరుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద గంటగంటకూ వరద వేగంగా పెరుగడంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. రెండో ప్రమాద హెచ్చరికవైపు అడుగులు వేస్తోంది. కాటన్ బ్యారేజీ వద్ద 12.80 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 11,27,715 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. సోమవారం రాత్రికి ఇక్కడ 7.60 అడుగులు మేర మాత్రమే ఇక్కడ నీటి మట్టం ఉంది. 24 గంటల్లోనే నాలుగు అడుగులకు పైగా వరదనీరు వచ్చి చేరింది. వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరించినట్టుగానే ఫ్లాష్ ఫ్లడ్స్ రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

మురుగునీరు పోయే దారి చూపారు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఉండ్రాజవరం : మండలంలోని కె.సావరం గ్రామానికి చెందిన అయ్యప్పనగర్ ముంపు ప్రాంత బాధితులకు మురుగునీరు పోయే దారి చూపండి అంటూ శనివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తక్షణ పరిష్కార చర్యలు ప్రారంభించారు. బోదె తవ్వకం పనులను సర్పంచ్ నార్ని రామకృష్ణ దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం నుంచి మురుగునీరు పారేందుకు రెండు బోదెలను తవ్విస్తున్నట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో గ్రామంలో నిల్వ ఉన్న మురుగునీరంతా బయటకు పోతుందన్నారు. క్షణం తీరిక లేకుండా అనేక పనులతో సతమతమవుతున్నప్పటికీ మంత్రి దుర్గేష్ తమ గ్రామ సమస్యను పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మట్టి సమస్యపై ఎంఎల్‌ఎకు వినతి

కడియం : సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలక వర్గ సభ్యులు మంగళవారం ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరిని కలిశారు. కడియం నర్సరీ రంగానికి అతిముఖ్యమైన మట్టిని సమకూర్చు కోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మైనింగ్ బిల్లులు, టోల్ బిల్లులతో సతమతమవుతున్నామని తెలిపారు. వీటి వల్ల తమపై అధనపు భారం పడుతుందన్నారు. దీనిపై ఎంఎల్‌ఎ గోరంట్ల సానుకూలంగా స్పందించారని నర్సరీ రైతులు తెలిపారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో ఎం.సత్యనారాయణ, పి.కొండబాబు, గాద నాగేశ్వరరావు, డైరెక్టర్లు తదితరులున్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

- కార్మిక సంఘాల ఐక్యవేదిక రాస్తారోకో
- భగ్నానికి పోలీసుల విఫల యత్నం
- నాయకుల పట్ల దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాస్తారోకోపై పోలీసులు జులుం ప్రదర్శించారు. స్థానిక శ్యామల సెంటర్లో సిఐటియు ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు శాంతియుతంగా రాస్తారోకో నిర్వహించారు. తొలుత మానవ హారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ టుటౌన్ పోలీసులు కార్మిక సంఘాల నేతలను బలవంతంగా పక్కకు తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కార్మిక సంఘాల నేతల పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ చొక్కా పట్టుకుని పక్కకు నెట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న తమపై దురుసుగా ప్రవర్తించడం తగదని వారించినా పోలీసులు వెనక్కి తగ్గలేదు. రోడ్డుపై కూర్చుని ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులైన టి.తులసి, ఎన్.రాజాలను పోలీసులు బలంగా నెట్టేయడంతో నేలపై పడిపోయారు. ఈ క్రమంలో రాజా చేతికి గాయమైంది. కార్మిక సంఘాల ప్రతినిధులు అడ్డుకోవటంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఓ దశలో సిఐ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అందర్నీ పోలీసు స్టేషన్‌కు తరలిస్తామంటూ ఆగ్రహంతో ఊడిపోయారు. దీంతో అక్కడి పరిస్థితి బీతావహంగా మారిపోయింది. ప్రజా సమస్యలపై ఆందోళనలు చేసే తమపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం తగదంటూ కార్మిక నేతలు వారించటంతో పోలీసులు వెనక్కి తగ్గారు.



రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు


విశాఖ పట్నం ఉక్కు పరిశ్రమను ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోరాడి సాధించుకున్నారని సిఐటియు ఉపాధ్యక్షులు టి.అరుణ్ గుర్తు చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి టి.అరుణ్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కె.జోజి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రయివేటీకరించి కార్పొరేట్లకు దోచి పెడుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో యువత ఉపాధి అవకాశాలపైనా తీవ్ర ప్రభావం ఉండబోతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుందర్‌బాబు, ఎస్ఎస్.మూర్తి, నర్సింహమూర్తి, తులసి, బేబిరాణి, మాణిక్యాంబ, అన్నపూర్ణ, సోమేశ్వరావు, రామకృష్ణ, మురళి, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు సుబ్రహ్మణ్యం, పోలిన వెంకటేశ్వరావు, రాజా, రాంబాబు పాల్గొన్నారు.



నాయకుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న పోలీసులు

వరద బాధితులకు 'తిరుమల' విరాళం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు రూ.50 లక్షల చెక్కును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజయవాడలో అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఒక్కో సమయంలో ఒక్కో ప్రాంతాన్ని ఇబ్బందులకు గురిచేస్తుంటాయని ఆ సమయంలో మిగిలినవారు బాధితులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. తమ స్టాఫ్, విద్యార్థుల భాగస్వామ్యంతో మరో రూ.50 లక్షలను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. వరద బాధితులకు "తిరుమల చారిటబుల్ ట్రస్ట్" ద్వారా వరదల సమయంలో సుమారు 25 వేల ఆహార ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను తమ విద్యాసంస్థల తరపున పంపినట్లు ఆయన తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నల్లజర్ల

విజయవాడ వరద బాధితులకు నల్లజర్ల మండలం ముసుళ్లకుంట గ్రామానికి చెందిన టిడిపి నేత నందమూరి రామకష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు వద్ద సేకరించిన రూ.లక్ష నగదును మంగళవారం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు తాతిన సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నందమూరి రామకృష్ణ, అయినపూడి రత్నకుమార్, మాజీ సర్పంచ్ బి.గంగరాజు, మారిశెట్టి సీతారాములు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదును తనిఖీ చేసుకోవాలి

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మండలం వరి పంట రైతులు అందరూ ఈ పంట, ఈ కెవైసి నమోదును తనిఖీలు చేసుకోవాలని ఎఒ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట, ఇకెవైసి నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించి పరిహారం వస్తుందని తెలిపారు. పంట రుణం, ధాన్యం కొనుగోలు ఇన్సూరెన్స్ రైతుభరోసా వంటి పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

వరద బాధితులకు రూ.58.58 లక్షల సాయం

ప్రజాశక్తి - నల్లజర్ల

గోపాలపురం నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.58,58,999 ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ద్వారా అందజేశామని నాయకులు యాలమాటి శ్రీనివాసరావు, యద్దనపూడి బ్రహ్మ రాజ తెలిపారు. పసుమర్తి రతిష్, జమ్ముల వీర వెంకట సతీష్ తెలిపిన వివరాలప్రకారం నల్లజర్ల మండలంలో రూ.20,75,613, ద్వారకాతిరుమల మండలంలో రూ.17,25,000, గోపాలపురం మండలంలో రూ.11,38,386, దేవరపల్లి మండలంలో రూ.9,20,000 సమకూర్చినట్టు తెలిపారు.

డంపింగ్ యార్డు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు


పట్టణం నడిబొడ్డున వందలాది నివాసాలు మధ్య అనాధికారికంగా నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును తొలగించాలంటూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాపారులు, చర్చిపేట వాసులు ధర్నా నిర్వహించారు. 6 నెలలు నుంచి మార్కెట్‌లో వ్యాపారులు ప్రజలు ఆందోళనలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. ఊర్లో వ్యర్థ పదార్థాలను తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వస్తుందన్నారు. వర్షాల నేపథ్యంలో పారిశుధ్యం మరింత క్షీణిస్తుందన్నారు. పేదలు నివశించే ప్రాంతాల్లో ఇలా డంప్ చేయడం తగదన్నారు. 10 రోజుల్లో డంపింగ్ యార్డును తొలగించాలని లేకుంటే చెత్తను మున్సిపల్ కార్యాలయానికి తరలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాస్‌రావు, టి.సుధాకర్, ఎం.అనిల్, శ్యామ్‌ప్రసాద్, నల్లా దుర్గా ప్రసాద్, గాంధీ, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్, వెల్ఫేర్ అసోసియేషన్(పిఎంపి అసోసియేషన్) ఆధ్వర్యంలో అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి మండలంలో పిఎంపి సభ్యులు క్యాన్సర్ నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజమండ్రికి చెందిన డెల్టా హాస్పిటల్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ హాజరై మాట్లాడారు. జీవనశైలిలో మార్పులు, పర్యావరణ కాలుష్యం,మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు వల్ల ఎక్కువగా కేన్సర్‌కు గురవుతున్నారని తెలిపారు. దీన్ని తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం అని అన్నారు. అనంతరం వైద్యులు, సభ్యులను సత్కరించారు. అనంతరం ప్రెస్ క్లబ్ నుంచిదేవీచౌక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విబిటి.రాజు, డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి ఎమ్ జితేంద్ర, మండల కార్యదర్శి వై.పవన్ కుమార్, కోశాధికారి డి.నాగార్జున, కోరుకొండ మండల అధ్యక్షులు కుంచే వినోద్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ప్రదీప్‌కుమార్, ఎంఇఒ జి.శ్రీనివాసరావు అన్నారు. ఆర్‌సిఎం చర్చి, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏలూరు ఆశ్రం హాస్పిటల్, సెయింట్ జోసెఫ్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియం చేసుకోవాలని, ఆరోగ్యం ఉండాలని వారు సూచించారు. ఫాదర్ కాటం బల్తజర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో జనరల్, గుండె, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, దంతాలు, గైనకాలజీ, ఎముకలు, నరాలు, కీళ్లు, చర్మ సంబంధిత తొమ్మిది రకాల వ్యాధులకు వైద్యం అందించామనాు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ సిల్బి, టిడిపి సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, కొర్లపాటి రాము, దుగ్గిరాల శ్రీను, పాఠశాల టీచర్స్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముంపునీటిని తోడేందుకు మోటార్ల ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- గోపాలపురం

కలెక్టర్ ఆదేశాల మేరకు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ముంపు నీటిని బయటకు పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'మూడు నెలలుగా ముంపులోనే' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 9న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, తహశీల్దార్ ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి చిన్నవెంకాయమ్మ పాఠశాలలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు. వారు మాట్లాడుతూ కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. మోటార్ ఇంజన్ ద్వారా నీటిని తోడిస్తున్నట్లు తెలిపారు. రోగాలు బారిన పడకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామని తెలిపారు. గోపాలపురంలో మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పరిసరాల్లో శానిటేషన్ పనులు నిర్వహించి బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు.



నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

పెరవలి : గోదావరి ఉధతి కారణంగా నిమజ్జనాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ పి.అప్పారావు ఉత్సవ కమిటీలకు సూచించారు. మల్లేశ్వరం, ఖండవల్లి, ముక్కామల, ఉమ్మడి వారిపాలెం, కాకరపర్రు, తీపర్రు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం తదితర ప్రాంతాలను ఎస్ఐ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. నదిలో స్నానం ఆచరించరాదన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం పంచాయతీకి చెందిన పోలిశెట్టి రమేష్‌కుమార్(45) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఈనెల 7న రమేష్‌కుమార్ పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు గుర్తించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే సోమవారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందిటన్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి - రాజోలు

వేగివారిపాలెం గ్రామంలో 9 ఏళ్ల బాలికపై 72 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. ఈనెల 7న వేగివారిపాలెం గ్రామంలో 4వ తరగతి చదువుతున్న 9 ఏళ్ల బాలిక పిల్లలతో కలిసి ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన వృద్ధుడు పితాని సత్యనారాయణ ఈ పాపను చాక్లెట్ ఇస్తానని ఇంటిలోని తీసుకుని వెళ్లి తలుపులు వేసి అత్యాచారం చేయబోయాడు. ఇంతలో తోటి పిల్లలందరూ తలుపులు కొట్టగా బయటకు వచ్చి పారిపోయాడు. బాలిక ఏడుస్తూ బయటికి వచ్చింది. బాలిక తల్లి మూగ కావడంతో ఎవరికి చెప్పకోలేక పోయింది. మంగళవారం బాలిక సోదరి గాయత్రి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో రఘుదేవపురంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.8,350 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గంగపాలెం గ్రామ శివారున అదే గ్రామానికి చెందిన వేలంశెట్టి చంద్రరావు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ రాంబాబు నాయక్ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

2,077 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వీరవరంలో అక్రమంగా నిల్వ చేసిన 2,077 కిలోల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5.14 లక్షలు ఉంటుందని తెలిపారు. టాటా ఏస్ వాహనం, కాటాను సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసిన పసలపూడి గంగరాజు, పాబోలు గణపతి, వ్యాన్ డ్రైవర్ వాసిరెడ్డి పద్దయ్యలపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ టి.నాగవెంకటరాజు తెలిపారు. ఈ దాడుల్లో డిటి నాగలక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ శివ, విఆర్ఒ వేమగిరి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిఒ 85పై వైద్యుల ఆగ్రహం

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 85పై వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. **చాగల్లులో** వైద్యులు ముఖేష్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు నిరనస తెలిపారు. ఈ జిఒ వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతుందన్నారు. రెండు నెలలుగా జిఒ 85ను రద్దు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మెకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. **ఉండ్రాజవరంలో** ఉండ్రాజవరం, వేలివెన్ను పిహెచ్‌సిలో వైద్యులు ఆర్.ఉషాదేవి, ఇర్ఫాన్, సృజనలు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డాక్టర్లకు తీవ్ర అన్యాయం కలిగించే జిఒను తక్షణమే రద్దు చేయాలన్నారు. **నల్లజర్ల** మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం నుంచి సమ్మె సైరన్ మోగించారు. వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 85కి వ్యతిరేకంగా తాము సమ్మెకు దిగినట్టు నల్లజర్ల పిహెచ్‌సి ప్రధాన వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు తెలిపారు. న్యాయం జరిగే వరకూ వైద్య సేవలకు అంతరాయం లేకుండా పోరు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దశల వారీ నిరసన కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని పిహెచ్‌సి అదనపు వైద్యాధికారి మహ్మద్ సిరాజుద్దీన్ ప్రకటించారు. వైద్యుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ వెల్లడించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్య పేట ప్రధాన రహదారిలో విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్‌ను లతలు, పిచ్చి మొక్కలు అల్లు కుపోయి ప్రమాదకరంగా మారింది. కళ్లేదుటే కన్పిస్తున్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవ డంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు, విద్యుత్ తీగలను లతలు అల్లుకుపోయాయి. తక్షణమే పిచ్చి మొక్కలను, లతలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న లతలు

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా ?

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- చర్యలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-ఆలమూరు

రహదారులు, భవనాల శాఖకు సంబంధించి ఆలమూరు మండల పరిధిలో సుమారు 50 కిలోమీటర్ల మేర వివిధ రహదారుల రూపంలో విస్తరించి ఉన్నాయి. ఈ మార్గాల్లో రోడ్లు ఛిద్రంగా మారి గోతుల పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రయాణీకులకు పలు చోట్ల వాహన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయితే ఆ శాఖ అధికారులు రోడ్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణాలకు ఎటు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.


ముఖ్యమైన రహదారులు

మండలంలో జొన్నాడ నుండి గుమ్మిలేరు వరకు 9 కి.మీ మేర, మడికి శివారు మల్లవానితోట నుంచి సందిపూడి వరకు 21 కి.మీ మేరకు ఆర్‌అండ్‌బి రోడ్లు ఉన్నాయి. ముఖ్యంగా ఇవి నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రోడ్లు భారీ గోతులతో ప్రయాణించడానికి వీల్లేని పరిస్థితికి చేరుకున్నాయి. ఇందులో మరీ ముఖ్యమైన 216 ఎ జాతీయ రహదారి జొన్నాడ సెంటర్ నుండి మండపేట మీదుగా కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిపై మరింత రద్దీగా వాహన రాకపోకలు నిత్యం సాగుతూ ఉంటాయి. అలాంటి ఈ రహదారిపై అధికారుల పర్యవేక్షణ లేక గోతులతో బురద మయంగా తయారైంది. దీంతో ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికుల వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ కోవలోనే జొన్నాడ 'ఎస్ టర్నింగ్', 'ఎల్ టర్నింగ్'ల వద్ద, మండల కేంద్రంలో ఎంపిపి పాఠశాల టర్నింగ్ వద్ద, మురళీ కృష్ణ, సత్యలక్ష్మి రైస్ మిల్లుల సమీప ప్రదేశాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అలాగే నర్సిపూడి హైస్కూల్ వద్ద, పెనికేరు గ్రామ మలుపుల్లులోనూ, కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు, పెదపల్ల, సందిపూడి వెళ్లే రహదారులలోను దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే చొప్పెల్ల నంది గుంట నుంచి మూలస్థానం వరకు విస్తరించిన ఐదు కి.మీ రోడ్డు దెబ్బతింది. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలువురు అంగవైకల్యంతో మంచానికే పరిమితం అయ్యారు. అయితే సంబంధిత అధికారులు రహదారుల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల పేర రూ. 2.12 కోట్ల వృధా

2019 జనవరిలో జొన్నాడ, గుమ్మిలేరు రహదారికి రూ.1.72 కోట్లతోను, జొన్నాడ ఎస్ టర్నింగ్, ఎల్ టర్నింగ్‌ల ఆధునికీకరణ రూ.40 లక్షలతోను నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ ఇంతవరకు గుత్తేదారులకు ఆనిధులు విడుదల కాకపోవడంతో వీటికి మరమ్మతులు విస్మరించారు. ఈ కారణంగానే రహదారి సమస్య మరీ దుర్భరంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కనీసం తాత్కాలిక మరమ్మతులైన చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


జొన్నాడ టర్నింగ్ వద్ద రోడ్డు దుస్థితి, ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల అవస్థ



చింతలూరు వద్ద ఆర్ అండ్ బి రహదారి దుస్థితి

రహదారుల నిర్మాణానికి చర్యలు



రహదారులు ఛిద్రంగా మారిన మాట వాస్తవమే. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంతకాలం నిధులు విడుదల విషయంలో జాప్యం ఏర్పడింది. తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు కోసం ఎస్టిమేట్లు పంపించాం. అయితే టెండర్ల కోసం పిలుస్తున్నా గుత్తేదారులు పాత బకాయిలు తీర్చినదే పనులు ప్రారంభించలేమని అంటున్నారు. దీంతో గుత్తేదారుల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– సూర్యనారాయణ, ఆర్ అండ్ బి డిఇ


నర్సిపూడి వద్ద గోతులతో మట్టి రోడ్డుగా మారిన ఆర్ అండ్ బి రోడ్డు

నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ

-21 కేసుల్లో కోటికి పైగా సొత్తు స్వాధీనం

-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన వివిధ చోరీ కేసులకు సంబంధించి నలుగురు ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. 21 ఇంటి దొంగతనాలు, నేరాలకు సంబం ధించి రూ.84 లక్షల విలువ చేసే 1200 గ్రాముల బంగారం, సుమారు రూ.10 లక్షల విలువ చేసే 11 కిలోల వెండి, ఒక మోటార్ సైకిల్‌తోపాటు సుమారు కోటికి పైబడిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడిం చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చోరీలకు సంబంధించి కాకినాడ గైగోలపాడుకు చెందిన పాత నేరస్తులు టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్‌కుమార్, వల్లి రామ్‌కుమార్, అలాగే తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు మెండి మహేశ్వర దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేశారు. వీరంతా కాకినాడతోపాటు, ఇంద్రపాలెం, తిమ్మాపురం, సామర్లకోట, పెద్దాపురంలలో పగలు ఇంటి బయట తాళాలు వేసిన ఇళ్ళను గుర్తించి, రాత్రి సమయంలో సదరు ఇళ్ళ తలుపులు, తాళాలు బద్దలు కొట్టి దొంగతనాలు చేసేవారని అన్నారు. ప్రధాన ముద్దాయిలను సోమవారం సర్పవరం గ్రామ శివారు భవన్నారాయణ స్వామి గుడి సమీపములో ఉన్నారని వచ్చిన సమాచారంతో వారిని అరెస్ట్ చేసి దొంగిలించిన సొత్తును, మోటార్ సైకిల్‌ను స్వాధీన పరుచుకున్నట్లు చెప్పారు. ముద్దాయిలను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ చోరీల్లో సొత్తును స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన అడిషనల్ ఎస్‌పి (పరిపాలన) ఎన్‌జివి.భాస్కరరావు, ఎస్‌డిపిఒ రఘువీర్‌విష్ణు, ఎస్‌బి డిఎస్‌పి సిహెచ్.శ్రీరామ కోటేశ్వరరావు, సర్పవరం సిఐ బి.పెద్దిరాజు, క్రైమ్ సిఐ వి.కృష్ణ, సర్పవరం ఎస్ఐ కె.రామకృష్ణమూర్తి, క్రైమ్ ఎస్ఐ వినయ్ ప్రతాప్, సర్పవరం ఎఎస్ఐ బలరాం, హెచ్‌సిలు సత్తిబాబు, రాజు, గణేష్, పిసిలు వెంకటరత్నం, క్రైమ్ సిబ్బంది గోవిందరావు, ధనరాజు సత్యమూర్తి, చిన్న, వర్మ, మౌళి, నాయుడు, ఐటి కోర్ పిసి స్వామిలను ఎస్‌పి అభినందించారు.


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

12న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట వాటర్ వర్క్స్‌లో నిర్వాహణ, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 12వ తేదీ సాయంత్రం పూట కనకాలపేట, గణపతి నగర్, యుకెవి నగర్, భీమ్ నగర్, పెద్దిరెడ్డి గార్డెన్స్, కోన గార్డెన్స్, ఫ్రాన్స్ తిప్ప ఏరియాలలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని కోరారు. నీటిని వృధా చేయరాదని సూచించారు.

ఎంఎల్ఎను కలిసిన చవితి నిర్వాహకులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను పలు గ్రామాలకు చెందిన చవితి ఉత్సవ నిర్వాహకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 29వ తేదీన పిళ్లారాయ స్వామివారి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయనను అన్న సమారాధన కమిటీ సభ్యులు కోరారు. యానాం బైపాస్ వర్తక సంఘం సభ్యులు ఈనెల 13వ తేదీన నిర్వహించబోయే లక్ష్మీ గణపతి హోమం కు రావాలని ఆహ్వానించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ క్యాంటీన్లో మంగళవారం నిరుపేదలకు ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. జనసేన నాయకులు కార్యకర్తలు భోజనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, బాలు సూరంపాలెం, సూరపరెడ్డి నరేష్, గోపి స్వామి, రేవూరి శ్రీను, పితాని వీరబాబు, రామకుర్తి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

బాధితులకు హెల్పింగ్ టీమ్ చేయూత

పజాశక్తి - తాళ్లరేవు

అగ్నిప్రమాద బాధితులకు హెల్పింగ్ టీమ్ సభ్యులు సూరంపూడి కుమార్, రెడ్డి మణికంఠ, గంజా మణికంఠ, శ్రీపాదం వల్లిపద్మ నిత్యవసర సరుకులు, బియ్యం, కూరగాయలు అందజేశారు. సహకరించిన దాతలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి-రామచంద్రపురం

స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచిన సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెలుగు మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. కష్టకాలంలో ప్రజల క్షేమం కోసం చురుకైన చర్యలు తీసుకోవడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సిఎం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, సహాయం అందజేసి, బాధితుల కోసం సత్వర చర్యలు చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వం వెంటనే ఆహారం, తాగునీరు, మెడికల్ సౌకర్యాలు, తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేయడం, అవసరమైన సమయంలో నిధులు కేటాయించడం వంటి చర్యలను తీసుకోవడం వలన విజయవాడ పట్టణం తొందరగా కోలుకొని సాధారణ స్థితికి చేరుకుందన్నారు. అదేవిధంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సిఎం చంద్రబాబు పిలుపుమేరకు వరద బాధితులకు అవసరమైన సామగ్రిని లారీలో తీసుకుని వెళ్లి విజయవాడలో ఉండి స్వయంగా వరద బాధితులకు అందజేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతోనే అభివృది సాధ్యం

కొత్తపేట: సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది చంద్రబాబును అక్రమ అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరు ఖండించారని ఆమె గుర్తు చేశారు. అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని దేశవ్యాప్తంగా మద్దతు పలికారని అన్నారు. వైసిపి అవినీతి, అరాచకాలకు, అక్రమ అరెస్టులకు నిరసనగా తెలుగు ప్రజలు చరిత్రలో నిలిచిపోయేలా వైసీపీని 11 సీట్లకే పరిమితం చేస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు.


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ డాక్టర్ మౌనిక

80 మందికి కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో మంగళవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ ప్రారంభించారు. శిబిరంలో ఆప్తాల్మిక్ డాక్టర్ ఎస్.మౌనిక 80 మంది కంటి రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, నాయకులు మంచెం బాలకృష్ణ, జొన్నాడ చిన్ని, కడలి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడ వరద బాధితులకు పలువురు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రజాప్రతినిధులు విజయవాడలో వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అమలాపురం: విజయవాడ వరద బాధితుల కోసం కడలి సేవా ట్రస్ట్ , అనాతవరానికి చెందిన విశ్రాంత పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగి అయిన కడలి శ్యామ్ బెనెగల్ ఎన్ఆర్ఐ ముందుకు వచ్చి సిఎం సహాయ నిధికి రూ.50 వేల విరా ళాన్ని చెక్కు రూపంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక విశ్వం వాయిస్ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కె.వెంకటేశ్వర రావు, గణేష్ కిరాణా కుప్పాల బ్రదర్స్ రూ.50 వేల చెక్కును సిఎం సహాయ నిధికి స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్‌కు అందించారు. **రామచంద్రపురం:** వరద బాధితులను ఆదుకోవాలని ద్రాక్షారామ పట్టణంలో మంగళవారం పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు. వెంటపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు నాయకులు నవీన్, హరీష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు. సేకరించడం విరాళాలన్నీ వరద బాధితులకు అందజేస్తామని ఈ సందర్భంగా వారు వివరించారు.

సహాయక చర్యలను పర్యవేక్షణ

మామిడికుదురు: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతమైన జక్కంపూడి కాలనీలో మంగళవారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అధినేత ఆదేశాల మేరకు డివిజన్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణ కార్యక్రమాలు చేస్తున్నారు. రెండవ రోజుఉదయం అధికార బందం తో సమావేశంమై తరువాత జక్కంపూడి కాలనీ బ్లాక్ నెంబర్ 174లో పర్యటించి ముంపు ప్రాంతం బాధితుల తో ముఖాముకీ నిర్వహించారు. బాధితులు వారి కష్టాలు చెప్పుకుంటూ సర్వం కోల్పోయామని కనీసం చదువుకునే పిల్లల పుస్తకాలు సైతం కొట్టుకుపోయాయని చెప్పడంతో అప్పటికప్పుడే ఎంఎల్ఎ సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లారు..ఓ వైపు శానిటేషన్, పూడికతీత పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్న సమయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్ఎ వసంత కష్ణ ప్రసాద్ రావడంతో మర్యాద పూర్వకంగా వాళ్లని కలిశారు. అనంతరం ఎంఎల్ఎ గిడ్డితో పాటు మనోహర్ కలిసి నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు


విజయవాడలో నిత్యావసరాలు అందజేస్తున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి, మంత్రి మనోహర్